ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జగిత్యాల

జిల్లా వార్తలు

5★★

మంగళవారం 6 ఆగస్టు 2024

ఆలయాల్లో భక్తుల రద్దీ
ధర్మపురిలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం 7

యువకుడి దారుణ హత్య
పూడూరులో విషాదం 7



పెళ్లి సందడి

- శ్రావణ మాసంలో శుభ ముహూర్తాలు
- ఆలయాల్లో పెరగనున్న ఆధ్యాత్మికత
- ఊపందుకోనున్న వ్యాపారాలు

జగిత్యాల, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): పచ్చని పందిరి... ముత్యాల ముంగిలిలో వేద మంత్రాలు... మేళతాళాలు... భాజా భజంత్రీల సందడి మొదలు కానుంది. బంధుజనులతో ఊరంతా సందడిగా మారనుంది. ఆషాఢ మాసం ముగిసి శ్రావణంలో అడుగిడిన శుభముహూర్తాల వేళ...కుటుంబ సభ్యుల సంబురాల నడుమ పెళ్లి వేడుకలకు సిద్ధమవుతున్నారు. వందలాది జంటలు ఒక్కటవనున్న వేళ, పట్టణ, పల్లె ప్రాంతాల్లో ఇప్పుడే పండుగ వాతావరణం నెలకొంది. దీనికి తోడు శ్రావణ మాసం శుభకరం కావడంతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు జోరుగా జరగనున్నాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అర్చనలు, వ్రతాలు నిర్వహించనున్నారు. ధర్మపురి, కొండగట్టు దేవస్థానాలతో పలు ఆలయాల్లో భక్తుల సందడి నెలకొననుంది.

శుభ ముహూర్తాలకు వేళాయె..

ఆగస్టు 7వ తేదీ నుంచి 28వ తేదీ వరకు మాత్రమే శుభ ముహూర్తాలు ఉన్నాయని పురోహితులు అంటున్నారు. ఆగస్టు 29 నుంచి నవంబర్ 2వ తేదీ వరకు 65 రోజుల పాటు ముహూర్తాలు లేవని చెబుతున్నారు. దీంతో జిల్లాలో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, కేశ ఖండనాలు, ఇతర శుభ కార్యాలు చేసుకునేందుకు కుటుంబాలు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసుకుం టున్నాయి. తిరిగి నవంబర్ 3వ తేదీ,7, 8, 10, 13, 14, 17, 20, డిసెంబర్‌లో 4వ తేదీ, 5,6,11,20, 25రోజుల్లో మంచి ముహూర్తాలు ప్రారంభమ వుతాయంటున్నారు.

వ్యాపారాల జోష్..

ఆషాఢమాసం విరామం తర్వాత మళ్లీ పెళ్లి ముహూర్తాలు మొదలు కావడంతో అనుబంధ వ్యాపారాలు జోరుగా సాగనున్నాయి. పౌరోహిత్యం, బట్టలు, బంగారు దుకాణాలతో పాటు సన్నాయి మేళాలు, వంట మనుషులు, ప్రింటింగ్ ప్రెస్, లైటింగ్, డెకరేషన్, టెంట్, పెళ్లి మండపాలు, ఫొటో, వీడియో గ్రాఫర్లకు చేతి నిండా పని దొరకుతుంది. ఆషాడ మాసానికి ముందుగానే పెళ్లి నిశ్చయించుకున్న కుటుంబాలు, కల్యాణ మండపాలకు అడ్వాన్స్‌లు చెల్లించారు. వివాహానికి ముందస్తుగా కనిపించేది పెళ్లి కార్డు. ఎవరి స్తోమతను బట్టి వారు పెళ్లి కార్డు... ఫ్లెక్సీలు, షామియానాలు, ఊరేగింపులు, సెట్టింగ్, డీజేలకు ప్రాధాన్యతను ఇస్తూ ముందస్తు ఒప్పం దాలు కుదుర్చుకున్నారు.

మంగళ గౌరీ వ్రతం

శ్రావణ మాసంలో అన్ని మంగళవారాల్లో చేసే వ్రతమే మంగళగౌరీ వ్రతం. దీన్ని శ్రావణ మంగళవార వ్రతం అని, మంగళగౌరీ వ్రతం అని, మంగళగౌరీ నోము అని పిలుస్తుంటారు. ఈ వ్రతాన్ని కొత్తగా పెళ్లయిన వారు ఆచరించాలని చెబుతుంటారు. ఐదేళ్ల పాటు మంగళగౌరీ వ్రతాన్ని ఆచరించి ఉద్వాసన చేయాడానికి పలువురు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. దీంతో సుమంగళిగా ఉండడమే కాకుండా వారి కుటుంబంలో సుఖశాంతులు, అష్టైశ్వర్యాలు ఉంటాయన్న నమ్మకం మహిళల్లో నెలకొంది.

వరలక్ష్మి వ్రతం...

శ్రావణమాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం ఈ వ్రతం చేస్తారు. ఒకవేళ అప్పుడు వీలు కాకుంటే శ్రావణమాసంలో మరొక శుక్రవారం అయినా ఈ వ్రతం ఆచరించవచ్చని పండితులు చెబుతున్నారు. వరలక్ష్మి వ్రతం వల్ల మహిళలకు సంపద, సౌభాగ్యం, సంతానం ప్రాప్తిస్తుందన్న నమ్మకం ఉంది.

శుక్ల పక్ష పౌర్ణమి

శ్రావణపౌర్ణమి, రాఖీ పౌర్ణమిగా జరుపుకునే ఈ రోజు సోదర, సోదరీ సంబంధానికి సూచికగా రక్షా బంధనం జరుపుకుంటుంటారు. అంతే కాకుండా ఈ రోజున నూతన యజ్ఞోపవీతధారణ, వేదభ్యాసాన్ని ప్రారంభం చేస్తారు. కృష్ణా పాడ్యమి, హయగ్రీవజయంతి, కృష్ణపక్ష విదియ, రాఘవేంద్రస్వామి ఆరాధన వంటి ముఖ్య రోజులు వచ్చేవి శ్రావణమాసంలోనే. కృష్ణాష్టమి, పొలాల అమావాస్య, గోవులను పూజించడం వంటివి సైతం ఈ నెలలో రావడం ప్రత్యేకత.

ప్రతీ ఇల్లు ఆలయం మాదిరిగానే..

పవిత్రమైన శ్రావణ మాసంలో ప్రతి ఇల్లు ఆలయాన్ని తలపిస్తుంది. సనాతన దర్మంలో చంద్రమాసం ప్రకారం మనకున్న 12 మాసాల్లో అయి దవి శ్రావణ మాసమని చెబుతారు. సోమవారాలు పగలంతా ఉపవాసం ఉండి రాత్రి వేళల్లో పరమేవ్వరినికి రుద్రాబిషేకం, బిల్వార్చనలు చేస్తే పా పాలు కడతేరుతాయని పండితులు చెబుతున్నారు. శ్రావణ మాసంలో మహా లక్ష్మీ అమ్మవారికి సైతం భక్తి శ్రద్ధలతో పూజలు చేస్తుండడం అనవాయితీగా వస్తోంది.



'స్వచ్ఛదనం-పచ్చదనం'

పక్కా ప్రణాళికతో నిర్వహించాలి

కలెక్టర్ సత్యప్రసాద్



లక్ష్మీపూర్ లో మొక్కలు నాటుతున్న జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాలరూరల్, ఆగస్టు 5 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో సోమవారం కలెక్టర్ ర్యాలీ తీసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఇల్లు, గ్రామం, పట్టణం, స్వచ్ఛగా ఉండాలని ఆకాంక్షించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, వీధికుక్కల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తడి చెత్త, పొడిచెత్త వేర్వేరుగా ట్రాక్టర్‌లో వేయాలన్నారు. ప్రజలు పెద్దఎత్తున స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో డీపీవో రఘువరణ్, ఆర్డీవో మధుసూధన్, జిల్లా సంక్షేమశాఖఅధికారి నరేష్, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రవిబాబు, పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడి మృతి



మృతి చెందిన ఉమాకంత్

కోరుట్ల, ఆగస్టు 5 : పట్టణంలోని ఏసీకోని గుట్ట ప్రాంతానికి చెందిన యువకుడు నడుస్తున్న రైలు నుంచి పడి సోమవారం మృతి చెందినట్లు బంధు వులు సోమవారం తెలిపారు. ఏసీకోని గుట్ట ప్రాంతానికి చెందిన మేనూర్వార్ ఉమాకంత్ (27) అనే యువకుడు వినాయక విగ్రహాల తయారీ చేస్తుంటాడు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా కేంద్రంలో వినాయకుల తయారి చేసే పని కుదుర్చుకోడానికి నిజామాబాద్ మీదుగా రైలు ప్రయాణంలో వెళ్లాడు. కామారెడ్డి జిల్లా బిక్కునూర్ మండలం రామేశ్వర్‌రావుపల్లె గ్రామ శివారు రైలు నుంచి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందాడు. రైతులు మృతదేహాన్ని చూసి రైల్వే పోలీసులకు సమాచారం అందించగా అక్కడి చేరుకున్న రైల్వే పోలీసులు అతని వద్ద ఉన్న ఆధారాలతో బంధువులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు బంధువులు కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పోస్టుమార్టం అయిన తరువాత మృతదేహాన్ని కోరుట్ల పట్టణానికి తరలించారు. కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి

రాయికల్, ఆగస్టు 5: విద్యార్థులు ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, ఎస్సై అనిల్ అన్నారు. పట్టణంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో సోమవారం ఆడిటోరియం, మినరల్ వాటర్ ప్లాంట్, ఐఎఫ్‌పి ప్యానెల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో ఇలాంటి వసతులు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న కళలను వెలికితీయడానికి ఆడిటోరియం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బాలె జయశ్రీశేఖర్, అకా డమిక్ డైరెక్టర్ నిఖిల్ కుమార్, ప్రెస్‌క్లబ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, ఆగస్టు 5 : జీఆర్ఆర్ కరాటే అకాడమీ కరీంనగర్ తెలంగాణ ఆధ్వర్యంలో నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీలలో కోరుట్ల విద్యార్థులు ప్రతిభ కనపరిచి 13 పతకాలు సాధించినట్లు ఓకినోవా స్కూల్ ఆఫ్ కరాటే స్పోర్ట్స్ అసోసియేషన్ కోచ్ అల్లె రమేష్ తెలిపారు. కరీంనగర్‌లోని రాజశ్రీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన హోరా హోరా పోటీల్లో గాజెంగి కిశోర్, యండి రుక్షలు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు రమేష్ తెలిపారు. నిశాంత్ బంగారు పతకం, హేమంత్ వెండి పతకం, దినేష్, యండి రుఫియా వెండి కాంస్య పతకాలను సాధించగా వరుణ్ రెడ్డి కాంస్య పతకాలు, హర్షిణి, హేమంత్ కుమార్ కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను టోర్నమెంట్ చీఫ్ అర్గనైజర్ గౌరు రాజిరెడ్డి అభినందించారు.

'బాలుడి కిడ్నాప్ అవాస్తవం'

జగిత్యాలరూరల్, ఆగస్టు 5 :జగిత్యాల పట్టణంలో నిహజారీ కాలనీలో ఓ బాలుడు ఆదివారం కిడ్నాప్‌నకు గురైనట్లు వ్యాపించిన వదంతుల్లో నిజంలేదని జగిత్యాల పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. వరంగల్‌కు చెందిన బాలుడు కొన్ని రోజులుగా ప్లాస్టిక్ డబ్బాలు అమ్ముకొని పట్టణంలో జీవిస్తున్నాడు. హజారీ కాలనీలో ఓ మహిళకు బాలుడు అనుమానస్పదంగా కనిపించడంతో రూమాన్ అనే వ్యక్తి జగిత్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాలుడిని అప్పగించాడని ఎస్సై తిరుపతి తెలిపారు.

గురుకులంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 5 : గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సమస్యలను త్వరగా పరిష్కారించాలని అధికారులను కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ కోరారు. సోమవారం మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థుల పరిస్థితి ఎలా ఉందని ఆరా తీశారు. సాంఘిక సంక్షేమ ఈఈ అధికారితో ఫోన్‌లో మాట్లాడి పాఠశాల నూతన భవనంలో మిగిలిన అభివృద్ధికి కలెక్టర్ మంజూరు చేసిన నిధులతో పనులు త్వరగా చేపట్టాలని కోరారు. హాస్టల్లో బాత్రూంలు, ఫ్లబింగ్, లైట్లు, ఫ్యాన్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, రెండు వారాల్లో పనులు పూర్తి చేసి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాఠశాలలోని ప్రధాన సమస్యలను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మైపాల్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరిస్తానని విద్యార్థి తల్లిదండ్రులకు భరోసా కల్పించి పాఠశాలలోనే చదువుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా ఉండడటం సరికాదని, స్వంత బిడ్డల్లాగా చూసుకోవాలన్నారు. పాఠశాలలో ఎమైనా సమస్యలు ఉంటే నేరుగా దృష్టికి తీసుకరావలని ఉపాధ్యాయులకు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్ కోరెపు రవి, మాసీ ఉపసర్పంచ్ తెలుకంటి శంకర్, నాయకులు చేపూరి శ్రీనివాస్, జీవన్‌రెడ్డి, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.



గురుకులం సమస్యలను అధికారులకు ఫోన్‌లో తెలుపుతున్న ఎమ్మెల్యే

గ్రామ దేవతల పూజారులకు గౌరవ వేతనం ఇవ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్

మెట్‌పల్లి, ఆగస్టు 5 (ఇబ్రహీంపట్నం): రాష్ట్రం లోని గ్రామ దేవతల పూజారులకు రాష్ట్ర ప్రభు త్వం గౌరవ వేతనం ఇవ్వాలని గ్రామ దేవతల పూజారుల రాష్ట్ర అధ్యక్షులు జగద్యావతి గంగాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణం లోని సంఘం భవనంలో జిల్లాల ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ తెలంగాణలోని అన్ని గ్రామాలలో గ్రామ దేవతల పూజారులను ప్రధాన పూజరులుగా గుర్తించి గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అదే విధంగా హైద్రాబాద్‌తో పాటు అన్ని జిల్లాలో స్థలాలు కేటాయించి సంఘ భవనంలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. రుణ సౌకర్యంతో పాటు ఇన్స్‌రెన్స్ పథకం వర్తింపజేయాలన్నారు. త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు దేవదాయ శాఖ మంత్రిని కలిసి వినతి పత్రం ఇవ్వానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చిప్ అడ్వైజర్ మహిపాల్, ప్రభు దాస్, నాయకులు శివనందం, పురుషోత్తం, వేంకటేశ్వర్లు, ప్రకాష్, మురళి పాల్గొన్నారు.

మంచి ఫలితాలు తీసుకురావాలి

డీఆర్పీ దేవేందర్‌రెడ్డి

కొడిమ్యాల, ఆగస్టు 5 : నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో మంచి ఫలితాలు తీసుకువచ్చే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలని డీఆర్పీ దేవేందర్‌రెడ్డి ఉపాధ్యాయులను కోరారు.

సోమవారం మండలంలోని తిర్మలాపూర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్పీ మాట్లాడుతూ విద్యార్థులకు సులభ మార్గంలో బోదన చేసి పదవ తరగతిలో మంచి ఫలితా లు రావటానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశానికి పెగడపల్లి, మల్యాల, కొడిమ్యాల మండలంలోని వివి ధ పాఠశాలలో భౌతిక వాస్త్రం బోధిస్తున్న ఉపాధ్యా యులు హాజ రైనారు. కాంప్లెక్స్ ప్రదానోపాధ్యాయురాలు జ్యోత్స్న దేవి, రిసోర్స్ పర్సనులు జగదీశ్వర్, పరమేశ్వర్, సీఆర్పీ సాయిలు, మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ భవనాలు

- విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్



ప్రభుత్వ స్థలల వివరాలను అడ్లూరికి వివరిస్తున్న అధికారులు

బుగ్గారం ఆగస్టు 5: మండల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వ శాశ్వత భవనలను నిర్మిస్తాం అని విప్ ఎమ్మెల్యే లడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మండలంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో విప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో నిర్మించబోయే ప్రభుత్వ భవనాలకు కావాల్సిన స్థలాల సర్వే నంబర్లను పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా బుగ్గారం గడీలో వచ్చే శుక్రవారం ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలకు పనులను ప్రారంభిస్తున్నట్లు విప్ తెలిపారు. అనంతరం ఎస్సీ సంక్షేమ బాలుర వసతీ గృహాన్ని తనిఖీ చేశారు. తహసీల్దార్ మజీద్, డీప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరూ పరిసరాలను..

పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



ధర్మపురిలో మొక్కలు నాటి నీరు పోస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, ఆగస్టు 5: ప్రతీ ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ఇంటి పరిసరాల్లో చెత్తా చెదారం లేకుండా డ్రైనేజీలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి వ్యక్తి మొక్కలు నాటాలని, నాటిన మొక్కకు నీరు పోసి ట్రీగార్డులు ఏర్పాటు చేసి సంరక్షించాలన్నారు. అనంతరం చింతామణి చెరువు వాక్ ట్రాక్ పక్కనే ప్రజా ప్రతినిధులు, అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. అంతకు ముందు వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులచే నిర్వహించిన ర్యాలీ జెండా ఊపీ జిల్లా అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఛైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు నాగలక్ష్మి, సంతోషి, పద్మ, అరుణ, సయ్యద్ యూనస్, సుధాకర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుసుమ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పాల్గొన్నారు.

●ధర్మపురి క్షేత్రంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ఆయన దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈవో శ్రీనివాస్ ఆయనకు స్వామి శేష వస్త్ర, ప్రసాదాలు బహూకరించి సత్కరించారు.

ప్రజల భాగస్వామ్యంతోనే..

బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్న ఛైర్‌పర్సన్

జగిత్యాల అర్బన్: ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛదనం-పచ్చదనం సాధ్యమవుతుందని బల్దియా ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ ప్రారంభోత్సవంలో భాగంగా పట్టణంలోని స్థానిక కొత్త బస్టాండ్ మినీ స్టేడియం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ జ్యోతి మాట్లాడుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. వార్డు కౌన్సిలర్‌లతో పాటు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

●స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని స్థానిక 17వ వార్డును బల్దియా ఛైర్‌పర్సన్ జ్యోతి సందర్శించారు.

●జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని వాయిదా(రద్దు) వేస్తున్నట్లు బల్దియా ఛైర్ పర్సన్ అడువాల జ్యోతి తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో నిమగ్నమై ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తిరిగి వచ్చే మంగళవారం యధావిధిగా ప్రజాదర్బార్ ఉంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఒకరికి గాయాలు

ఓదెల, ఆగస్టు 5: మండల కేంద్రంలో జండా వద్ద రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభం పట్టుకున్న నల్లవేని శంకర్ విద్యుదా ఘాతంతో కిందపడిపోయాడు. అక్కడ ఉన్న మెడికల్ షాప్ వద్దకు మందుల కోసం వచ్చిన శంకర్ అనుకోకుండా విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో ప్రమాదం జరిగింది. కిందపడి పోయిన శంకర్‌ను సమీపంలోని యువకులు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని అక్కడినుంచి తొలగించాలని తెలిపినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు పేర్కొన్నారు. దీనిపై గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

మొరాయించిన రైల్వే గేట్

● **అరగంటకు పైగా నిలిచిన రాకపోకలు**

మల్యాల, ఆగస్టు 5: మల్యాల క్రాస్ రోడ్డు సమీపంలోని రామన్నపేటకు వెళ్లే మార్గంలో గల రైల్వే గేట్ సోమవారం సాయంత్రం మొరాయించింది. రైలు రావడంతో అక్కడి సిబ్బంది గేట్లు వేశారు. అయితే రైలు వెళ్లాక అరగంట గడిచినప్పటికీ గేట్లు తెరచుకోకపోవడంతో ఇరువైపుల వాహనాలు, స్కూల్‌బస్సులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. అక్కడి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైలు పట్టాల మధ్య సాంకేతిక లోపం ఏర్పడడంతో గేట్లు తెరచుకోలేదని గేట్‌మన్ తెలిపాడు. పట్టాల మధ్య సరి చేశాక కాసేపటికీ గేట్లు తెరచుకోవడంతో వాహనదారులు వెళ్లిపోయారు. కొన్ని నెలల క్రితం కూడా ఇలాగే గేట్లు మొరాయించాయి.

చీటి వ్యాపారిపై కేసు నమోదు

మల్లాపూర్, ఆగస్టు 5 : మండలంలోని మొగిలిపేట గ్రామానికి చెందిన ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారిపై కేసు నమోదు చేసినట్లు మల్లాపూర్ ఎస్సై కిరణ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని మొగిలిపేట గ్రామంలో ఆకుల గంగాధర్‌గౌడ్ చీటి వ్యాపారం నిర్వహిస్తున్నాడు. గ్రామానికి చెందిన సంగం పెద్దగంగారాం, ముక్కెర లక్ష్మీ కట్టిన చీటి డబ్బులు చెల్లించాలని గంగాధర్‌గౌడ్‌ను పలుమార్లు బాధితులు కోరగా తనకే ఇంకా డబ్బులు రావాల్సి ఉందని బెదిరింపులకు పాల్పడ్డాడు. దీంతో సంఘం పెద్ద మనిషి పెద్దగంగారం మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.




బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ప్రారంభిస్తున్న ఆది శ్రీనివాస్, ఈవో వినోద్‌రెడ్డి, స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

తిరుమల తిరుపతి తరహాలో

బ్రేక్ దర్శనం అమలు

- ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ కల్చరల్, ఆగస్టు 5 : తిరుమల తిరుపతి తరహాలో వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం బ్రేక్ దర్శనం అమలు చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ రాజన్న ఆలయంలో శ్రావణమాసం మొదటి రోజు సోమవారం బ్రేక్ దర్శనం క్యూలైన్‌లను ఆలయ ఈవో వినోద్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ బ్రేక్ దర్శనం టికెట్ కొనుగోలు చేసి క్యూలైన్ ద్వారా రాజన్న ఆలయంలోకి ప్రవేశించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ప్రభుత్వ విప్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు శీఘ్ర దర్శనం కలిగేలా ఒక మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. యాదాద్రి తిరుమలతిరుపతి దేవస్థానం తరహాలో వేములవాడ రాజన్న ఆలయంలో కూడా ప్రతి భక్తుడికి శీఘ్రదర్శనం కలిగేలా బ్రేక్ దర్శనం సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ప్రతీ రోజు ఉదయం 10.15 నుంచి 11.15 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 5 వరకు బ్రేక్ దర్శనం ఉంటుందని తెలిపారు.

రాజన్న ఆలయానికి గత పాలకులు ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని మోసం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మొదటి మూడు నెలల్లోనే వీటీడీఏ సమావేశం ఏర్పాటు చేసి రూ. 20 కోట్లు నిధులు వెనక్కి తీసుకొచ్చామన్నారు. మొన్నటి బడ్జెట్ రాజన్న ఆలయానికి రూ.50 కోట్ల నిధులు కేటాయించినట్లు చెప్పారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు సాగరం వెంకటస్వామి, సంఘస్వామి యాదవ్, కనికరపు రాకేష్, తూం మధు, గూడూరి మధు, పుల్కం రాజు, ఇప్పపూల అజయ్, అన్నారం శ్రీనివాస్ ఉన్నారు.

రాజన్న ఆలయానికి శ్రావణ శోభ

వేములవాడ కల్చరల్: రాజన్న ఆలయం శ్రావణ శోభ సంతరించుకుంది. శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కోడెమొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రారంభించిన బ్రేక్ దర్శనం ద్వారా మొదటి రోజున 96 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా మహాలింగార్చన

శ్రావణ సోమవారం సందర్భంగా అర్చకులు ఉదయం 5.30 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. స్వామివారి కల్యాణ మండపంలో సాయంత్రం 6.05లకు లింగాకృతిలో దీపాలను వెలిగించి మహాలింగార్చన చేపట్టారు. ఆలయ ఓపెన్ స్లాబ్‌లో నైమిశారణ్య పీఠం పూజ్యా శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి భక్తులకు శివలీల విలాసం ప్రవచనం వినిపించారు.



ప్రవచనం వినిపిస్తున్న శ్రీబాల బ్రహ్మానంద సరస్వతి

ఆలయాల్లో భక్తుల రద్దీ

ధర్మపురిలో శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 5: ధర్మపురి క్షేత్రంలో శ్రావణమాస ఉత్సవాలు సోమవారం ప్రారంభం అయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని మొదటి సోమవారం స్థానిక లక్ష్మీ నరసింహస్వామి అనుబంధ శ్రీ ఉగ్ర నరసింహ, వేం కటేశ్వర, రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. రామలింగేశ్వర స్వామి వారలకు మహారుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్ కుమార్, ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీని వాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీని వాసాచారి, రమణాచార్య, నంబి నరసింహమూర్తి, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభి షేక్ పౌరోహితులు బొజ్జ సంపత్‌కుమార్, సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

శివుడికి భక్తి శ్రద్ధలతో పూజలు

రామలింగేశ్వర స్వామి, సమీపంలో గల అక్కపల్లి రాజరాజేశ్వరుని ఆలయం వద్ద భక్తుల రద్దీ పెరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య స్వామి వారికి అర్చకులు రుద్రాభిషేకం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు, అన్నపూజ నిర్వహించారు. అంతకు ముందు గోదావరి నదిలో స్నానాలు చేసి, ఉపవాస దీక్ష చేపట్టిన భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయ వేద పండితులు పాలెపు ప్రవీణ్ శర్మ, అర్చకులు విశ్వనాథశర్మ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

కొండగట్టులో శ్రావణ సప్తాహ ఉత్సవాలు

మల్యాల, ఆగస్టు 5: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణమాస సప్తాహ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ప్రధాన ఆలయ మండపంలో విశ్వక్సేనా రాధన, వాసుదేవ పుణ్య హవచనం, రక్షబంధనం, రుత్విక్‌వరుణం, దీక్ష స్వీకరణ, అంజనేయ స్వామికి పంచామృతా భిషేకం,తుళసీదళర్చాన, వెంకటేశ్వరస్వామి, అమ్మవారికి అభిషేకార్చన నిర్వహించారు. సాయంకాలం అమ్మవారికి సహస్రనామా కుంకుమార్చన, వేంకటేశ్వర స్వామికి తిరువీధి సేవ నిర్వహించిన అనంతరం హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.ఈ ఉత్సవాలలో ఏఈవో అంజయ్య, స్థానాచార్యులు కపీంధర్, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, అధికారులు సునీల్, చంద్రశేఖర్, సంపత్, ఉమామహేశ్వర్, రాజేందర్‌రెడ్డి భక్తులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు





కొనసాగుతున్న నీటి విడుదల



అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి విడుదలవుతున్న నీరు

పెద్దపల్లి/రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 5: పెద్దపల్లి జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. సోమవారం రాత్రి తొమ్మిది గంటలకు ప్రాజెక్టులోకి 7,822 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. నంది పంప్ హౌస్ నుంచి మూడు మోటార్ల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని మిడ్ మానేరులోకి ఎత్తిపోస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.091 టీఎంసీలు ఉన్నది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గిపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం సాయంత్రం నుంచి ఒక మోటార్ నిలిపి వేసి మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయత్రి పంప్ హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. సోమవారం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోశారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఇన్‌ఫ్లో తగ్గడంతో సోమవారం అర్ధరాత్రి నుంచి ఒక పంపును నిలిపివేసి మూడు పంపుల ద్వారా నీటిని విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. మొదటి రెండు రోజులు ఐదు పంపుల ద్వారా రోజుకు 15,750 క్యూసెక్కుల విడుదల చేశారు. మూడో రోజు నుంచి తొమ్మిదో రోజు వరకు నాలుగు పంపాల ద్వారా రోజుకు 12,600 క్యూసెక్కుల నీటిని తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్ హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 9.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్ మానేరు ప్రాజెక్టులోకు ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 12600 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 200 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్థి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు ప్రస్తుతం 16.533 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోతలు ప్రారంభం

ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట మండలం అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు సోమవారం ప్రారంభయయ్యాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 0.76 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. మధ్యమానేరులో 10.03 టీఎంసీల నీరు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎత్తిపోతలను ప్రారంభించింది. రెండు మోటార్ల ద్వారా 6,400 టీఎంసీల నీటిని ప్రతీ రోజు అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఎత్తిపోస్తామని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోయడం ప్రారంభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్సారెస్పీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల: ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. సోమవారం ఎస్సారెస్పీలోకి 13,167 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 44.937 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం

● రూ. 2కోట్ల ప్రభుత్వ ధాన్యాన్ని అమ్ముకున్న వ్యాపారి...? ● సీఎంఆర్ ధాన్యం ఇచ్చింది ఒకరికి... బియ్యం అడుగుతుంది మరొకరిని...!



హుజూరాబాద్, ఆగస్టు 5: జిల్లా సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యంతో సీఎంఆర్ ధాన్యం మాయమైంది. హుజూరాబాద్ పట్టణ శివారులోని పరకాల క్రాస్ రోడ్ సమీపంలో పరమేశ్వర ఇండస్ట్రీస్ యజమాని ఓరుగంటి సమ్మిరెడ్డి 2016లో తన మిల్లును సత్యనారాయణ అనే వ్యాపారికి లీజ్‌కు ఇచ్చాడు. అప్పటి నుంచి సమ్మిరెడ్డి అనారోగ్య కారణంగా హైద్రాబాద్‌లో కొడుకుల వద్ద ఉంటున్నాడు. ఇదే అదునుగా చూసుకొని సత్యనారాయణ మిల్లు యజమాని సమ్మిరెడ్డి సంతకాలను ఫోర్జరీ చేసి ప్రతి ఏటా ప్రభుత్వం నుంచి ధాన్యాన్ని తీసుకుని బియ్యాన్ని ప్రభుత్వానికి పెడుతున్నాడు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మారడంతో పెండింగ్‌లో ఉన్న ధాన్యం రికవరీ చేయాలని సివిల్ సప్లయిస్ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో 2022 సంవత్సరానికి సంబంధించిన సుమారు రెండు కోట్ల రూపాయల ధాన్యం సత్యనారాయణ బాకీ ఉన్నట్లు తేలింది. సివిల్ సప్లయిస్ అధికారులు వచ్చి మిల్లును తనిఖీ చేయగా, ధాన్యం మొత్తం అమ్ముకున్నట్లు తెలిసింది. ఇంతలోనే సదరు వ్యాపారి సత్యనారాయణ అనారోగ్యానికి గురై కోమాలోకి వెళ్లాడు. ఈ విషయం తెలుసుకున్న సివిల్ సప్లయిస్ అధికారులు సత్యనారాయణకు నోటీసులు పంపించినా ఎవరు స్పందించలేదు. ప్రతి ఏటా మిల్లులో ధాన్యం ఉందా లేదానని చూసుకోవాల్సిన సివిల్ సప్లయిస్ అధికారులు అటూ వైపు కన్నెత్తి చూడలేదు. అనంతరం సివిల్ సప్లయిస్ అధికారులు మిల్లు యజమాని సమ్మిరెడ్డి వద్దకు వెళ్లి 16 ఏసీకేల బియ్యం సత్యనారాయణ ప్రభుత్వానికి బకాయి ఉన్నాడని, దానిని నువ్వే చెల్లించాలని సమ్మిరెడ్డిని హెచ్చరించారు. తనకు వడ్లతో సంబంధం లేదని, సత్యనారాయణను అడగాలని తెలిపినా సమ్మిరెడ్డికి సివిల్ సప్లయిస్ అధికారులు నోటీసులు పంపించారు. ఈ విషయంపై తనకు సంబంధం లేదని సమ్మిరెడ్డి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. సివిల్ సప్లయిస్ అధికారుల నిర్లక్ష్యం వల్లనే ఇలాంటి తప్పులు జరుగుతున్నాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సివిల్ సప్లయిస్ అధికారులపై సమగ్ర విచారణ జరపాలని మిల్లు యజమాని సమ్మిరెడ్డి కోరారు.

వాగులో పడి వ్యక్తి మృతి

ఓదెల, ఆగస్టు 5: మండలంలోని పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన మిట్టపల్లి రాజేశం (45) హుస్సేన్ మియా వాగులో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రాజేశం ఆదివారం ఉదయం 10 గంటలకు పొలం పనులకు అని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోగా కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం హుస్సేన్‌మియా వాగులో శవం తేలిఉండటంతో మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య మహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేర కు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

'ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి'

రామడుగు, ఆగస్టు 5: వెలిచాల గ్రామానికి చెందిన కుతాడి కనకయ్యను గొర్రెల దొంగతనం చేశానని ఒప్పుకోవాలని హింసించిన రామడుగు ఎస్ఐ సురేందర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ సంఘాల నాయకులు సోమవారం సీపీ అభిషేక్ మొహంతికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా కార్యదర్శి తిప్పరపు సురేష్, న్యాయవాదుల సంఘం నాయకుడు బీఆర్ఎస్ చొప్పదండి నాయకుడు కట్టకోల లక్ష్మణ్‌కుమార్, కొంపల్లి సాగర్, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య



రాజశేఖర్ (ఫైల్)

కొడిమ్యాల, ఆగస్టు 5: మండలంలోని పూడూర్ గ్రామంలోని బీరప్పస్వామి గుడి సమీపంలో అదే గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ (30) సోమవారం తెల్లవారుజామున దారుణ హత్యకు గురయ్యాడు. కొడిమ్యాల ఎస్సై ఎస్ సందీప్ తెలిపిన వివరాల మేరకు పూడూర్ గ్రామానికి చెందిన కందుల రాజశేఖర్ గ్రామంలో బైక్ మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన రాజశేఖర్ తిరిగి రాకపోవడంతో సోమవారం వేకువజామున అతడి తల్లి ఆచూకీ తెలుసుకునేందుకు వెళ్లింది. ఇంటి సమీపంలోని బీరప్పస్వామి గుడి వద్ద రక్తపు మడుగులో పడి మృతి చెంది ఉన్న కొడుకును గుర్తించింది. గుర్తు తెలియని వ్యక్తులు రాజ శేఖర్ తలపై కట్టెతో కొట్టి, నోట్లో మట్టి పోసి హత్య చేశారు. అనంతరం నిందితులు రాజశేఖర్ ద్విచక్ర వాహనం నుంచే పెట్రోలు తీసి శరీరంపై పోసి కాల్చడానికి ప్రయత్నించారు. పోలీసుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, మల్యాల సీఐ రవి చేరుకుని వివరాలు సేకరించారు. రాజశేఖర్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు క్లూస్ టీం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహించారు. హత్య జరిగిన సమీప ప్రాంతాల్లో కొద్ది రోజులుగా కొందరు యువకులు గంజాయి తీసుకుంటున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు.

హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ధర్నా

తమ కుమారుడిని హత్య చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కరీంనగర్ జగిత్యాల ప్రధాన రహదారిపై ఉన్న పూడూర్‌లో ధర్నా చేశా రు. సమాచారం అందుకున్న మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై సందీప్ అక్కడికి చేరుకొని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. నిందితులను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు.

రెస్టారెంట్ యజమాని ఆత్మహత్య



లక్ష్మీరాజం (ఫైల్)

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 5: వ్యాపారంలో నష్టం వచ్చిందని మనస్తాపంతో సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్‌లో కొండ లక్ష్మీరాజం (36) అనే రెస్టారెంట్ అండ్ బేకరీ యజమాని సోమవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన లక్ష్మీరాజం సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో నివాసం ఉంటూ గాంధీనగర్ కూరగాయల మార్కెట్ వీధిలో అన్‌లిమిటెడ్ రెస్టారెంట్, బెకరీని నడిపిస్తున్నాడు. వ్యాపారానికి రూ.40 లక్షల వరకు పెట్టుబడి కావడంతో అప్పులు చేశాడు. దీంతో తనకు వంశపారంపర్యంగా వచ్చిన స్థలాలను విక్రయించి అప్పులు తీర్చేశాడు. వ్యాపారంలో నష్టం రావడం, ఆస్తి విక్రయించడంతో మనస్తాపం చెందాడు. ఎప్పటిలాగే తన ఇద్దరు కూతుళ్లను స్కూల్‌లో దింపేసి గాంధీనగర్‌లో ఉన్న హోటల్‌కు చేరుకొని వెనుక గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకున్నాడు. కొంత కాలంగా హోటల్‌లో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులతో తన భర్త లక్ష్మీరాజం ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య వైశాలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

నకిలీ ఫోన్‌పే యాప్‌తో యువకుడి మోసం

మంథని, ఆగస్టు 5: నకిలీ ఫోన్ పే యాప్ ద్వారా మోసానికి పాల్పడుతున్న ఓ యువకుడిని మంథనిలో పట్టుకున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఊషన్నపల్లి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అనే యువకుడు ఈజీ మనీకి అలవాటు పడి ఫేక్ ఫోన్ పే యాప్‌ను తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. ఈ నకిలీఫోన్ పే ద్వారా ట్రాన్సాక్షన్ చేసినట్టు మాత్రమే కన్పిస్తుంది కానీ ఎదుటి వారి ఖాతాలో ఎలాంటి డబ్బులు జమ కావు. ఈ యాప్ ద్వారా రాజ్‌కుమార్ పట్టణంలోని త్రినేత్రి ఆన్‌లైన్ షాపులోని స్కానర్‌కు డబ్బులు పంపించాడు. ఆన్‌లైన్ ద్వారా రూ. 5 వందలు చెల్లించానని, డబ్బులు ఇవ్వాలని కోరాడు. తన ఖాతాలోకి డబ్బులు జమ కాకపోవడంతో అనుమానం వచ్చిన షాపు నిర్వాహకుడు అంబటి సాయి తన స్నేహితుల సాయంతో అది ఫేక్ యాప్ అని నిర్ధారించుకొని అతన్ని పట్టుకున్నాడు. వెంటనే పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించగా పోలీసులు నిందితుడిని పోలీస్‌స్టేషన్‌కు తలించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

మంథనిరూరల్, ఆగస్టు 5: మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన దాసరి ఓదెలు(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య దాసరి లక్ష్మి కథనం ప్రకారం.. ఓదెలు 5 సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడని, ఆదివారం మధ్యాహ్నం తమ పత్తి చేను నుంచి వెళ్లిన ఓదెలు పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని తెలిపింది. చికిత్స కోసం మంథనికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించామని చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు తెలిపింది.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వివాహిత మృతి

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 5: భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడని మానసిక వేదనకు గురైన వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసింది. ఆరోగ్యం క్షీణించి సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లద్నాపూర్ గ్రామానికి చెందిన పులి లక్ష్మి తన కూతురు నవ్యను పెద్దపల్లి మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన బాలసాని జంపయ్యకు ఇచ్చి వివాహం చేశారు. వారికి ఇద్దరు పిల్లలున్నారు. భర్త జంపయ్య వేరే మహిళతో సంబంధం పెట్టుకోగా విషయం తెలిసిన బాలసాని నవ్య (35) మనస్తాపానికి గురై జూలై 14న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు పెద్దపల్లి ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లో చికిత్స అందించారు. అయినా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో హైదరాబాద్ తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు. ఆర్థికస్థోమత లేకపోవడంతో స్వగ్రామం ముత్తారం తీసుకొచ్చారు. ఆరోగ్యం క్షీణించి ఆదివారం రాత్రి మృతి చెందినట్లు మహిళ కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృత్యువాత

గంభీరావుపేట, ఆగస్టు 5 : మండలంలోని దమ్మన్నపేట సమీపాన ఆదివారం రాత్రి చిరుత దాడి చేసి దూడను చంపేసింది. గోరంటాల గ్రామ సమీపంలో ఇటీవల చిరుత దాడిలో రెండు ఆవులు చనిపోయిన సంఘటన మరవక ముందే దమ్మన్నపేట గ్రామ సమీపాన వీరబోయిన నారాయణ అనే రైతుకు చెందిన దూడ చిరుత దాడిలో మృతి చెందింది. పెద్దమ్మ అటవీ ప్రాంత శివారు గ్రామాలైన గోరంటాల, దమ్మన్నపేట రైతులకు చెందిన మూగజీవాలను చిరుత చంపుతుండడంతో భయందోళనలు నెలకొన్నాయి. ఫారెస్ట్ అధికారులు స్పందించాలని, చిరుత బారి నుంచి కాపాడాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు. సంఘటన స్థలాన్ని డిప్యూటీ రేంజ్ అధికారి అంజలి, బీట్ ఆఫీసర్ రమేష్ పరిశీలించారు.

హైదరాబాద్‌కు బస్సుల సంఖ్య పెంచాలని వినతి

మెట్‌పల్లి, ఆగస్టు 5 (ఇబ్రహీంపట్నం) :మెట్‌పల్లి బస్ డిపో నుంచి వివిధ ప్రాంతాలకు బస్సుల సంఖ్య పెంచాలని కోరుతూ సోమవారం సుఖీభవ ఆర్గనైజేషన్ వ్యవస్థాపకులు బొక్కెనపల్లి నాగరాజు డిపో మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మెట్‌పల్లి నుంచి కామరెడ్డి మీదుగా హైదరాబాద్‌కు బస్సులు పెంచాలని, నిర్మల్ బుట్టాపూర్ మీదుగా బస్సు నడపాలని, మెట్‌పల్లి నుంచి వేములవాడ మీదుగా హైదరాబాద్‌కు బస్సు నడపాలని, మెట్‌పల్లి నుంచి ధర్మపురి, వేములవాడ, యాదగిరిగుట్టకు ప్రత్యేక బస్సులు నడపాలని కోరినట్లు తెలిపారు. బస్టాండ్ ప్రాంతంలో మొరం పోసి బస్టాండ్‌ను శుభ్రంగా ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజన్ నాయకులు నాంపల్లి గట్టయ్య, తరి స్వామిలు ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్తా

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, ఆగస్టు 5: జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యత అని వారి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట జర్నలిస్టులు చేస్తున్న దీక్ష సోమవారానికి మూడవ రోజుకు చేరింది. జీవన్‌రెడ్డితో పాటు పలువురు సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా జగిత్యాల పాత్రికేయుల ఇళ్ల స్థలాల కల్పన ప్రక్రియ నాన్చుతూ వస్తున్నారన్నారు. ధరూర్ క్యాంప్‌లో ఇళ్ల స్థలాల కేటాయింపునకు తాను వెనక్కి వచ్చిన మాట వాస్తమేనని భవిష్యత్ ప్రజా అవసరాలకు క్యాంప్ స్థలాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. జగిత్యాల పాత్రికేయుల సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. దీక్షలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కాంగ్రెస్ నాయ కులు బండ శంకర్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

జగిత్యాలరూరల్, ఆగస్టు 5 : జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ సీడ్‌ప్రాసెస్ ప్లాంట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ సీడ్ కార్పొరేషన్ ఛైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డిని హైద్రాబాద్‌లోని కార్యాలయంలో సోమవారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కలిసి విన్నవించారు. లక్ష్మీపూర్ గ్రామంలో నిర్మించిన సీడ్‌ప్రాసెస్ ప్లాంట్ నిర్మాణం చివరిదశకు చేరకుకుందని, పైకప్పు కోసం నిధులు మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఈనెల 9వ తేదీన లక్ష్మీపూర్ సీడ్ ప్రాసెస్‌ప్లాంట్‌ను అన్వేష్‌రెడ్డి సందర్శిస్తారని తెలిపారు.

బేటీ బచావో బేటీ పడావో పథకంపై అవగాహన

రాయికల్, ఆగస్టు 5: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ అశ్విని ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహల వచ్చే నష్టం గురించి, సేఫ్ టచ్, అన్‌సేఫ్ టచ్ గురించి, టోల్ ఫ్రీ నెంబర్స్ గురించి వివరించారు. సెల్‌ఫోన్ వాడటం వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి, ప్రధానోపాధ్యాయుడు సదాశివ, పంచాయతీ కార్యదర్శి రాజేష్, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది గౌతమి, హేమ, రజిత తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ దళిత మోర్చా ఆధ్వర్యంలో ధర్నా

రాయికల్, ఆగస్టు 5: అంబేద్కర్ అభయహస్తం పేరుతో ప్రవేశపెట్టిన స్కీమ్‌ను దళితులందరికీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర పిలుపు మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఎస్సీలకు అందరికీ అందజేయాలని, బ్యాక్‌లాగ్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఖయ్యూంకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దళిత మోర్చా అధ్యక్షుడు బన్న సంజీవ్, ప్రధాన కార్యదర్శి లింగంపెల్లి రాజేష్, ఉపాధ్యక్షులు సందెల అభి, పాలెపు చందు, మారంపెల్లి శేఖర్, బట్టు నాగరాజు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివముష్టి వ్రత ఉద్యాపన

కోరుట్ల, ఆగస్టు 5 : శ్రావణమాసం మొదటి సోమవారం పురస్కరించుకొని పట్టణంలోని జవహర్ రోడ్డులో గల ఆంజనేయస్వామి దేవాలయంలో వేద పండితుడు ప్రత్యేక పూజలను జరిపి శివముష్టి వ్రత ఉద్యాపన వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వేదపండితుడు మత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజలను నిర్వహించారు. గణపతి, పుణ్యాహవచనం, రుద్రాభిషేకం, అన్న పూజ కార్యక్రమాలను జరిపారు. మహిళలకు కుంకుమ పూజ నిర్వహించంగా అధిక సంఖ్యలో మహిళలు పూజలో పాల్గొన్నారు. విష్ణు, లలితశాస్త్ర నామ పారాయణను జరిపి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు అల్లాడి ప్రవీణ్‌కుమార్, చిద్రాల వినోద్, తాటికొండ అంజనేయులు, కంతాల భాస్కర్, బట్టు హరికృష్ణ, జిల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రయోగాత్మక విద్యతోనే ఆసక్తి

రాయికల్, ఆగస్టు 5: పాఠశాలల్లో ప్రయోగాత్మక విద్యను అందించినప్పుడే విద్యార్థులు ఆసక్తితో కొత్త విషయాలు నేర్చుకుంటారని జిల్లా సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ అన్నారు. మండలంలోని తాట్లవాయి ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన పాఠశాల సముదాయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇన్‌స్పైర్ అవార్డు కోసం నామినేషన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను విడుదల చేశారు. జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బోగ రమేష్‌ను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి రాఘవులు, బొల్లె చిన్నయ్య, పొన్నం రమేష్, చిలివేరి విజయ్, రాజమల్లయ్య, గిరిధర్, శ్రీనివాస్‌రెడ్డి, అమరేందర్, శేఖర్, శంకరయ్య పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిలిపేయాలని అదనపు కలెక్టర్‌కు వినతి

జగిత్యాల రూరల్, ఆగస్టు 5: ఎస్సీ వర్గీకరణ నిలిపివేయాలని కోరుతూ ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జిల్లా సమీకృత భవనంలో అదనపు కలెక్టర్ రాంబాబును సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, సుప్రీంకోర్టు తీర్పును మరోసారి పునఃపరిశీలన చేయాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఆర్టికల్ 341 పరిధిలోని అంశాన్ని విబేధించి రాష్ట్రాలకు వర్గీకరణచేసే హక్కును కల్పించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు జిల్లా మాల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో కార్గో సేవలు

కరీంనగర్ రీజనల్ సేల్స్ మేనేజర్ రాజు

బీర్‌పూర్,ఆగస్టు 5: మారుమూల గ్రామాల ప్రజలకు అందుబాటులో సేవలు అందించడం కోసమే కార్గో కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కరీంనగర్ రీజనల్ మేనేజర్ రాజు అన్నారు. సోమవారం బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఆర్టీసీ కార్గో లాజిస్టిక్ సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ కార్గో సేవలు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్ర, కర్ణాటక, మహారాష్ట్రలో కూడా అందుబాటులో కలవని అన్నారు. బీర్ పూర్ మండల ప్రజలు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు టీజీఎస్ ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోవాలని కోరారు. భద్రంగా మీకు చేరువగా పార్సల్‌ను అతి త్వరలో అతి తక్కువ ధరలో పంపించడం జరుగుతోందని తెలిపారు. తుంగూర్ ఆర్టీసీ కార్గో ఏజెంట్ రెచవేణి శ్రీనివాస్ సెల్ నంబర్ 9705161800 సంప్రదించాలని, అన్నా చెల్లెల అనుబంధ రాఖీలు కూడా పంపించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బీ. రమేష్, బీ. వేణుగోపాల్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మణ్‌రావ్, తుంగూర్ మాజీ ఎంపీటీసీ ఆడెపు మల్లీశ్వరి తిరుప తి, బీజేపీ మండల అధ్యక్షులు ఆడెపు నర్సయ్య పాల్గొన్నారు.

రామన్నపేట మాజీ సర్పంచ్ మృతి

మల్యాల, ఆగస్టు 5: రామన్నపేట మాజీ సర్పంచ్ వకుళాభరణం శ్రీనివాస్ (55)సోమవారం మృతి చెందాడు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీనివాస్ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. శ్రీనివాస్ రామన్నపేట సర్పంచ్‌గా రెండు సార్లు, ఎంపీటీసీగా, మండల టీడీపీ అధ్యక్షుడిగా, కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పాలకమండలి సభ్యుడిగా పనిచేశారు. శ్రీనివాస్ మృతి పట్ల ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

స్వచ్ఛదనం-పచ్చదనంతోనే సంపూర్ణ ఆరోగ్యం

మెట్‌పల్లి మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత



ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య

మెట్‌పల్లి, ఆగస్టు 5(ఇబ్రహీంపట్నం): స్వచ్ఛదనం-పచ్చదనంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోని మొక్కలు నాటాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాణవేని సుజాత-సత్యనారయణ అన్నారు. సోమవారం పట్టణంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచదనం-పచ్చదనం కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు వార్డులలో ర్యాలీ తీశారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఇంటింటికి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. పట్టణంలో వీధి కుక్కల బెడద లేకుండ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్, కమిషనర్ టి.మోహన్, కౌన్సిలర్‌లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోరుట్ల : స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలు అన్ని వర్గాల ప్రజలు పాల్గొన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కమీషనర్ తిరుపతి ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలను మున్సిపల్ వైస్ ఛైర్మెన్ గడ్డమీది పవన్‌లతో పాటు పాలక వర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అధికారులు, పాలక వర్గ సభ్యులు నిర్వహించిన అవగాహన ర్యాలీని జెండా ఊపి ఛైర్‌పర్సన్ ప్రారంభించారు. అంబేద్కర్ చౌరస్తాలో మానవ హారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ఆర్‌పీలు, కార్మికులు పాల్గొన్నారు.

రాయికల్: ప్రజలు పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులు, అధికారులు పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్య క్రమంలో భాగంగా రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని ఇటిక్యాల, ఆలూరు, భూపతిపూర్ గ్రామాలతో పాటు అన్ని గ్రామాల్లో సోమవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి, మానవహారంగా ఏర్పడి పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రాయికల్ పట్టణంలోని బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉర్దూ మీడియం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎం.సంపత్ రావు, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీడీవో చిరంజీవి, మున్సిపల్ కమిషనర్ జగ దీశ్వర్ గౌడ్, మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మాండ్లు, ప్రధానోపాధ్యాయులు శ్రీపతి రాఘవులు, ఉపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ కుడుకల రవీందర్ పాల్గొన్నారు.

కొడిమ్యాల : మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు ప్రారంభించారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై ప్రజలకు, మహిళా సంఘాలకు అవగాహన కలిపించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల ప్రత్యేక అధికారి చరణ్‌రాజు, తహసీల్దార్ రాజమణి, ఏవో జ్యోతి, ఎంపీవో వాసవి, కళాశాల ప్రిన్సిపాల్ డా.. వెంకటేశ్వర్లు, ఎన్‌ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ తిరుపతి పాల్గొన్నారు.

కథలాపూర్ : మండల ప్రత్యేకాధికారి జిల్లా డీఆర్‌డీవో ఏపీడీ మదన్ మోహన్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి స్వచ్ఛదనం-పచ్చదనం వల్ల చేకూరే ప్రయోజనాల గురించి వివరించారు. పారిశుద్యం మెరుగు పరచడంతో పాటు విరివిగా మొక్కలు నాటాలని కోరారు. ఊట్‌పల్లి పాఠశాలను సందర్శించి నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో శంకర్, వైద్య, ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, సెర్ప్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్యాల: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంను మండలంలోని అన్నీ గ్రామాల్లో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సభలు నిర్వహించి ర్యాలీలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. పాఠశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో స్వాతి గ్రామాల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, పాల్గొన్నారు.

పెగడపల్లి : స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని సోమవారం మండలంలోని ఊరూరా నిర్వహించారు. అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించడంతో పాటు ర్యాలీలు తీసి ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యార్థినులకు స్వచ్ఛదనం-పచ్చదనంపై ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాలలో మండల ప్రత్యేకాధికారి వేణుగోపాల్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీవో మహేందర్, ఏపీఎం సమత, ఏపీవో అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అవగాహన ర్యాలీలు చేపట్టారు. తహసీల్దార్ రమేష్, ప్రధానోపాధ్యాయులు కిషోర్, మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ గంగారెడ్డి, నాయకులు లక్ష్మారెడ్డి, పంచాయితీ కార్యదర్శి పాల్గొన్నారు.

వెల్గటూర్: ప్రతీ ఒక్కరు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి జయసింగ్, తహసీల్దార్ శేఖర్, ఎంపీడీవో రవీందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెల్గటూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు పిచ్చి మొక్కలు తొలగించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. ఎంపీవో శ్రీనివాస్, కార్యదర్శి హఫీజ్, నాయకులు మురళిగౌడ్, సందీప్‌రెడ్డి, పశు వైద్యాధికారి శ్రీప్రియ, సీహెచ్‌వో జగన్నాథం, పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని మండలంలోని ప్రతి గ్రామాల్లో విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ అన్నారు. స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని గ్రామాల్లో కార్యదర్శులు నిర్వహించిన గ్రామ సబలు, ర్యాలీ కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు. ఆత్మనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభకనబరిచిన విద్యార్థులకు పంచాయతీ కార్యదర్శి బహుమతులు అందజేశారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మండల వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, కార్యదర్శులు ప్రశాంత్, అశోక్‌గౌడ్, నిజాముద్దీన్, రవి, కారోబారులు రాములు పాల్గొన్నారు.

బీర్‌పూర్: మండలంలోని అన్ని గ్రామాలలో సోమవారం గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారుల ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాలను ప్రారంభించారు. గ్రామాలలో ర్యాలీలు నిర్వహించి గ్రామ సభలను ఏర్పాటు చేశారు. అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్: స్వచ్ఛదనంతో పచ్చదనాన్ని పెంచి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని అంటువ్యాధులు రాకుండా నివారించాలని మండల ప్రత్యేక అధికారి, కోరుట్ల ఆర్డీవో ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామాలలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాలపై గ్రామంలో గామ సభలను నిర్వహించారు. అయిలాపూర్‌లో అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు గ్రామంలో సభలను నిర్వహించి అవగాహన ర్యాలీలను నిర్వహించారు. శిధిలావస్తలో ఉన్న ఇండ్లను గుర్తించి అక్కడ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలను వివిరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల ప్రత్యేక అధికారులు తహసిల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, మండల విద్యాధికారి నరేశం, మండల వ్యవసాయ అధికారిణి నాగమణిల తో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండలంలోని అన్ని గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. పారిశుధ్యం మెరుగు పరచడంతో పాటు విరివిగా మొక్కలు నాటాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయలలో గ్రామ సభలు నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రాజేంధర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : గ్రామాల్లో స్వచ్ఛదనం పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రత, చెట్ల అవష్యాకత, చెత్తతో ఎరువు తయారు వంటి కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాన్ని అధికారులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మండల ప్రత్యేకాధికారి సాయిబాబా ప్రజలకు సూచించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ జమీరుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్ వినోద్, ఎంపీడీవో రాంరెడ్డి, ఏవో బొట్ల కరుణ, ఎంఈవో జమున దేవి, ఏపీఎం త్రివేణి పాల్గొన్నారు.



రాయికల్ మండలం ఇటిక్యాలలో ర్యాలీ..



వెల్గటూర్‌లో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న అధికారులు



మల్యాలలో స్వచ్ఛదనం గురించి వివరిస్తున్న ఎంపీడీవో

వరదకాలువ బ్రిడ్జిపై గుంతల పూడ్చివేత

● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

మల్యాల, ఆగస్టు 5: మండలంలోని ముత్యంపేట గ్రామ శివారులో గల వరదకాలువ బ్రిడ్జిపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను గ్రామ పంచాయితీ అధికారులు పూడ్చివేయించారు. సోమవారం అధ్వానంగా రహదారులు శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కాగ పంచాయితీ కార్యదర్శి స్వప్న సిబ్బంది రాజేశ్వర్ జేసీబీతో గుంతల పూడ్చివేత చేపట్టారు. వంతెనపై గల గుంతల ను పూడ్చివేయించడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

ధర్మపురి, ఆగస్టు 5: ధర్మపురి మండలంలోని గొల్లపల్లి (మగ్గిడి) గురుకుల పాఠశాల విద్యార్థులు ఇటీవల జరిగిన డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. అండర్-14 జావెలిం గ్‌త్రో ఎం. వృతిక్, అండర్-18 బి. హర్షవర్దన్ ఆయా విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిద్దరు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ రమేష్, పీడీ, పీఈటీ ఈ. సంతోష్, ఎ. శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

వర్షాలకు కూలిన ఇల్లు

కథలాపూర్, ఆగస్టు 5 : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని అంబారిపేటలో తోకల నర్సవ్వకు చెందిన ఇల్లు కూలిపోయింది. నర్సవ్వ కుటుంబ సభ్యులు ఇంట్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా కూలిపోవడంతో ఇంట్లోంచి పరుగులు తీశారు. ప్రమాదం నుంచి బయట పడ్డామని బాధిత మహిళ తెలిపారు. ప్రస్తుతం ఇళ్ల లేక అవస్థలు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, విప్

గొల్లపల్లి, ఆగస్టు 5: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందిన పలు బాధిత కుటుంబస భ్యులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డితో కలిసి సోమవారం పరామర్శించారు. మండలంలోని ఇస్రాజ్‌పల్లె, బొంకూర్, దమ్మన్నపేట, రాఘవపట్నం గ్రామాల్లోని పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇటీవల అనారోగ్యాలతో మృతి చెందారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ వారి చిత్రపటాలకు నివాళులర్పించి బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విశాంత్ రెడ్డి, తాజా మాజీ ప్రజాప్రతినిధులు గంగాధర్, సత్యనారాయణ గౌడ్, పద్మవెంకటేశం, రాజ్యలక్ష్మి, తిరుపతిరెడ్డి, దానవ్వలక్ష్మణ్, మాజీ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు తాండ్ర సురేందర్, సీనియర్ నాయకులు సంతోష్, శ్రీనివాస్, వెంకటేష్ గౌడ్, తిరుపతి, రవీందర్, మల్లేశం, అరవింద్ గౌడ్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

గొల్లపల్లి, ఆగస్టు 5: పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గొల్లపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సూపరింటెండెంట్ రవీందర్‌రావుకు తాజా మాజీ ప్రజాప్రతినిధులు సోమవారం వినతి పత్రం సమర్పించారు. సర్పంచుల ఫోరం మండలశాఖ మాజీ అధ్య క్షుడు ఎరవేని రమేష్ ఆధ్వర్యంలో వివిధ గ్రా మాల తాజా మాజీ ప్రజాప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ఐదేళ్ల పదవి కాలంలో గ్రామాల్లో సొంత నిధులు వెచ్చించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూశామన్నారు. సర్పంచుల పదవీ కాలం ముగియడంతో నిధులు మంజూరు కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న గ్రామ పంచాయతీ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం సూపరింటెండెంట్‌కు సమర్పించారు. తాజా మాజీ ప్రజాప్రతినిధులు రాగం శంకరయ్య, అలిశెట్టి రవీందర్, నల్ల శ్యామ్, పావనినగేష్ గౌడ్, హనుమంత రెడ్డి, లక్ష్మి రాజేశం, సిద్దంకి మల్లయ్య పాల్గొన్నారు.

సంక్షిప్తం సమాచారం

రాయికల్: రాయికల్ పట్టణంలో కుక్కలు, కోతుల బెడద తప్పించాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్‌కు సోమవారం బీఆర్ఎస్ కౌన్సిలర్లు వినతి పత్రం సమర్పించారు.

బీర్‌పూర్: మండలంలోని పలుగ్రామాలలో సోమ వారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పలు కుటుంబాలను పరామర్శించారు. మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన గందే చందు అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అదే గ్రామానికి చెందిన రాజన్న, నర్సింహులపల్లి గ్రామానికి చెందిన సూద లింగన్న, యూత్ కాంగ్రెస్ నాయకులు ఎనుగంటి సతీష్ తండ్రి మరణించగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.

భీమారం: మండలంలోని పలువురు మృతుల కుటుంబసభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమవారం పరామర్శించారు. వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కాటిపెల్లి లలితమ్మ, పసునూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మాలోతు సాలవ్వ, రాజలింగంపేట గ్రామానికి చెందిన చొప్పరి మల్లేశం కుటుంబసభ్యులను పరామర్శించారు.

●ధర్మాజీపేటకు చెందిన గుగ్లావత్ చిరంజీవికి చెందిన రూ.80 వేల విలువ గల తులం చైన్ కట్కాపూర్ సమీపంలోని వెన్నెముద్దల గండి వద్ద ఆదివారం పోగొట్టుకున్నాడు. చైన్ మోసిన్ బాబాకు దొరకగా ఆయన దానిని సోమవారం చిరంజీవికి అందచేసాడు.

కథలాపూర్ : మండలంలోని సిరికొండకు చెందిన మాడిశెట్టి మౌనిక అనే ఐదు నెలల చిన్నారి తన ప్రతిభతో తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు లభించగా సోమవారం వేములవాడ బీఆర్ఎస్ ఇన్‌ఛార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు అభినందించారు. 135 ఫ్లాష్ కార్డులను గుర్తించి ప్రతిభ చాటిన నేపథ్యంలో చిన్నారి తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. విషయం తెలిసిందే. కాగా తదనంతరం కథలాపూర్, తాండ్ర్యాలలో ఇటీవల మృతి చెందిన కుటుంబాలను పరామర్శించి మృతికి గల కారణాలను తెలుసుకుని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ వైస్‌ఎంపీపీ గండ్ర కిరణ్‌రావు, మస్కూరి కిరణ్, రఫీ, ముజీబ్ తదితరులు ఉన్నారు.

రాయికల్: రాయికల్ తహసీల్దార్ కార్యాలయంలో పని చేసి బదిలీపై వెళ్లిన మహేష్‌ను సోమవారం తహసీల్దార్ ఖయ్యూం, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆయన చేసిన సేవలను పలువురు కొనియాడారు. మహేష్ సారంగాపూర్ గ్రామానికి బదిలీ కాగా, అతని స్థానంలో ధర్మపురి నుంచి శ్రీలత ఏఎస్‌వోగా విధుల్లో చేరారు.

సారంగాపూర్ : మండల కేంద్రానికి చెందిన గడ్డం గంగారెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శంచారు. ఎమ్మెల్సీ వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ్ర రాంచందర్‌రెడ్డి ఉన్నారు.

జగిత్యాలరూరల్: తెలంగాణ రాష్ట్రంలోని ముప్పైవేల ప్రభుత్వ పంచాయతీరాజ్, గురుకులపాఠశాలల్లో ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించడం పట్ల టీఎస్‌పీఎస్ ఈయూ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో ఇచ్చినహామీ మేర కు పాఠశాలల్లో కార్మికులను నియమించడం కోసం రూ. 79 కోట్ల నిధులు కేటాయించడంతోపాటుగా, ఉచితవిద్యుత్ అమలు చేయడం పట్ల సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

తల్లి పాలతోనే రోగ నిరోధక శక్తి

బల్దియా ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



తల్లులకు పౌష్టికాహారం అందిస్తున్న ఛైర్‌పర్సన్

జగిత్యాల అర్బన్, ఆగస్టు 5: తల్లిపాలతో శిశువులో రోగ నిరోధక శక్తి పెరుగుతుందని దీంతో వారు ఆరోగ్యంగా ఎదుగుతారని బల్దియా ఛైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని మైనార్టి కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి జ్యోతి ముఖ్యఅతిథిగా హాజరై పౌష్టిక ఆహారాన్ని గర్భిణులు, తల్లులు, బాలింతలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్‌లు సాహెరాబాను, ఆసియా సుల్తానాతో పాటు అంగన్వాడీ టీచర్లు, ఏఎన్‌యంలు పాల్గొన్నారు.

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. గర్భిణుల కు సీమంతం, ఆరు నెలలు నిండిన పిల్లలకు అన్నప్రాసన, మూడేళ్ల పిల్లలకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఇటిక్యాల సెక్టార్ సూపర్‌వైజ్ పద్మావతి, ఏఎన్ ఎంలు భాగ్యలక్ష్మి, రజిత, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, కారోబార్ కిశోర్, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వీవోఏలు పాల్గొన్నారు.

కొడిమ్యాల : తల్లి పాలతోనే శిశువు ఆరోగ్యంగా ఉంటుందని ఎంపీడీవో స్వరూప అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో తల్లి పాల వారోత్సవం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యతపై అవగాహన కలిపించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలన్నారు. అంతక ముందు చిన్నారులకు అన్నప్రాసన, గర్భిణులకు సీమంతం చేయించారు. ఎంపీవో వాసవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఉమ, సుదారాణి, మమత, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటనర్సమ్మ పాల్గొన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని తాటిపల్లి సెక్టార్ పరిధిలోని చల్గల్, తాటిపల్లి గ్రామాల్లో సోమవారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ తీసి తల్లిపాలు విశిష్టత గురించి అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో తహసీల్ధార్ రాంమోహన్, పాఠ శాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.